




# కరపత్రం

SINCE 2014

మంగళవారం మే 12, 2026 | సంపుటి : 2 | సంచిక : 210 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్



**హైదరాబాద్,మే 11 :**
రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను లోక్ భవన్ లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కలిసారు. జూన్ 12 న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్ ను ఆహ్వానించారు. విద్యార్థులు పొగాకు, మద్యం ,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభలో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచన ను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి గవర్రన్‌ను సిఎం ఆహ్వానించేందుకు కలిసారు.

# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

- వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షస్తున్నా
- 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్






**హైదరాబాద్,మే 11 :**
ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం.

2 లో

### కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

## కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి



**హైదరాబాద్,మే 11 :**
కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

2లో..

### మౌళిక వసతులపై పస్రత్యేక దృష్టి

## హ్యామ్ రోడ్లపై నేడోరేపో సిఎంత్ చర్చలు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మే 11 :**
నాణ్యమైన మౌలిక వసతుల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా హ్యామ్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. హ్యామ్ తుది అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం లేదా బుధవారం కలిసి చర్చిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హ్యామ్ ప్రాజెక్ట్ పురోగతిపై సోమవారం సచివాలయంలో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. హ్యామ్ ప్రాజెక్ట్ టెండర్ పక్రియపై అధికారులను ఆరా తీశారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఏఐ, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న హ్యామ్ మోడల్ వివరాలు మంత్రికి వివరించారు

2లో..

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి



**హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేత ఉన్నారు. వీరితో పాటు శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరా సభ్యులుగా ఉన్నారు. ఈ కమిషన్ ఐదేళ్ల పాటు కొనసాగనుంది.

### బండి సంజయ్ కుమారుడి కేసు..

## నీరుగారే ప్రయత్నం జరుగుతోందా?



**హైదరాబాద్:**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసు నీరుగారే ప్రయత్నం జరుగుతోందా? విచారణ కోసం సిట్ ఏర్పాటు చేయడం కేసును నీరుగార్చడమేనా?

2 లో



# మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్

- రామగుండం ఎరువుల కర్మాగారం నుండి 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు
- సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి.
- రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
- ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్,మే 11 :**
జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత / జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు.

2 లో

## సనత్‌నగర్ టిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు

» అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశం



**హైదరాబాద్,మే 11 :**
పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌పై మంత్రి సోమవారం రివ్యూ చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్‌లో భాగంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా.. ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ డిపార్ట్‌మెంట్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు,

2లో..

# రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

» అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు
» ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు



**హైదరాబాద్,మే 11 :**
ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు

2లో..

## రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయి సీజ్..

### అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



**గచ్చిబౌలి:**
రాష్ట్రాల సరిహద్దులు దాటి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న భారీ గంజాయి అక్రమ రవాణాను సైబరాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పక్కా సమాచారంతో కూకట్‌పల్లి ఎస్‌వోటీ బృందం, పటాన్‌చెరు పోలీసులతో కలిసి దాడులు చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం మే 12, 2026

# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

మొదటి పేజీ తరువాయి

వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సమీక్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమూల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. 'విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. 'టీచర్లకు ఇది కేవలం ఉద్యోగం కాదు.. అదొక బాధ్యత. 19 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

## సనత్‌నగర్ టిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యసేవలు

మొదటి పేజీ తరువాయి

వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ట్రయల్ రన్‌లో భాగంగా 22 డిపార్ట్‌మెంట్లలో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్ , ఎంఆర్‌ఐ , డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ పూర్తి అయిందని తెలిపారు. ట్రయల్ రన్‌లో భాగంగా టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷–లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷–లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్లు, వారి అటెండెంట్లకు భోజన సదుపాయం కల్పించాలని, అటెండెంట్ల కోసం ధర్మశాలను సైతం సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

## హ్యామ్ రోడ్లపై నేడోరేపో సిఎంతో చర్చలు

మొదటి పేజీ తరువాయి

అధికారులు. బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేల నుంచి రూ.89 వేలకు పెరిగిందని తెలిపారు. బిటుమెన్ ధరల్లో దాదాపు వందశాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు. జీఎస్టీ అదనపు భారం, ఇతర మెయింటెనెన్స్, పశ్చిమాసియ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెరగడానికి కూడా ఓ కారణమని అధికారులు పేర్కొన్నారు. గుజరాత్‌లో 66శాతం, మహారాష్ట్రలో 47శాతం ధరలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ధరలు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. ÷ఔ.4 నుంచి రూ.5 లక్షల కోట్లతో దేశంలో 374కు పైగా హ్యామ్ ప్రాజెక్టులు కొనసాగు తున్నాయని మంత్రి తెలిపారు.

## బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

**సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం**

**ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు**

**మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం**

పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ ప‌క్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

## రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయి సీజ్..

మొదటి పేజీ తరువాయి

రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు.

మహారాష్ట్రకు చెందిన మనీషా పద్వాల్ గంజాయి వ్యాపారంలో భారీ లాభాలు గడించాలనే ఉద్దేశంతో ఒడిశాకు చెందిన సరఫరాదారు ట్రిబ్యూన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వీరిద్దరికీ ప్రతాప్ హరిదాస్ పవార్(24) మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 8న మహారాష్ట్ర నుంచి నిందితులు డీసీఎం వాహనంలో ఒడిశాలోని మల్కన్‌గిరికి గంజాయి కోసం బయలుదేరారు. కాగా సరఫరాదారు ట్రిబ్యూన్.. ప్రతాప్‌కు ఫోన్ చేసి గంజాయి రాజమండ్రి చేరుకుందని.. అక్కడి నుంచి తీసుకెళ్లాలని చెప్పడంతో నిందితులు అక్కడికి చేరుకొని అనుమానం రాకుండా డీసీఎంలో లోడ్ చేశారు. దానిపై ఖాళీ కూరగాయల ప్లాస్టిక్ ట్రేలను పేర్చారు. కారును ఎస్కార్ట్‌గా వాడుతూ నగరానికి చేరుకొని, ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా.. సోమవారం ఉదయం ముత్తంగి వద్ద కూకట్‌పల్లి ఎస్‌వోటీ, పటాన్‌చెరు పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**

మహారాష్ట్రకు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్, డీసీఎం యజమాని ఆనంద్ మాయప్ప హోవల్(34), కారు యజమాని బాలాజీ గణేశ్ హోన్మణి(35), డీసీఎం డ్రైవర్లు రోహిత్ హోవల్ (27), చందన్‌శివే ఔదుంబర్(46), రంజిత్ రాజేందర్ గడగే(27)తో పాటు బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా పరారీలో ఉన్న ప్రధాన నిందితులు మనీషా, ట్రిబ్యూన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయితో పాటు డీసీఎం, కారు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు గంజాయి రవాణాకు సంబంధించిన లావాదేవీలను హవాలా రూపంలో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సరకు పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ పి.శోభన్‌కుమార్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ జి.వినాయక్‌రెడ్డి, డీఐ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో కానిస్టేబుల్ దారుణ హత్య

కానిస్టేబుల్ దారుణ హత్యకు గురైన ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. గాంధీనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో ఏపీఎస్పీ కానిస్టేబుల్ నాగేశ్వరరావు ప్రాణాలు విడిచారు. ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. కానిస్టేబుల్‌పై మద్యంమత్తులోని యువకులు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న క్లూస్ టీమ్ చేరుకుని విచారణ చేపట్టింది.

## ప్రార్థనా స్థలాల్లో లౌడ్ స్పీకర్ల గోల డిజిపికి లేఖ రాసిన డిప్యూటీ స్పీకర్

ప్రార్థనా స్థలాల్లో అనధికార లౌడ్‌స్పీకర్లపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకి రఘురామ సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. శబ్దకాలుష్య నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రార్థనా స్థలాల్లో అధిక శబ్దంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లౌడ్‌స్పీకర్లతో విద్యార్థులు, వృద్ధులు, రోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని రఘురామ వ్యాఖ్యానించారు. ఏడాదిలో గరిష్ఠంగా 15 రోజులు మాత్రమే లౌడ్‌స్పీకర్లకు అనుమతి ఉందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనధికార సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో శాంతిభద్రతలు కాపాడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా నిబంధనలు అమలు చేయాలని రఘురామ కోరారు.

## అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

**– పిడుగులతో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ**

అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తర శ్రీలంక తీరానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు, రైతులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్తు నిర్వహణ శాఖ ప్రకారం ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా తీరప్రాంత జిల్లాలతో పాటు రాయలసీమలో కూడా వాతావరణ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిడుగుల సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని హెచ్చరించారు. ఉరుముల శబ్దాలు వినిపించిన వెంటనే సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. అలాగే పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో నిలబడకూడదని అధికారులు హెచ్చరించారు. చెట్ల కింద ఆశ్రయం పొందడం ప్రమాదకరమని స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లో పనిచేస్తున్న సమయంలో ఉరుముల శబ్దాలు వినిపిస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.వర్ష సూచనలతో పాటు కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతు న్నాయని వెల్లడించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం ప్రాంతాల్లో వడగాలుల హెచ్చరిక జారీ చేశారు. జికే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు, చింతూరు, కూనవరం మండలాల్లో హీట్ అలర్ట్ అమల్లో ఉందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయవాడ తూర్పులో అత్యధికంగా 42.3÷బిఅ నమోదు, కుక్కునూరు, కూనవరం ల 42.1÷బిఅ, మంత్రాలయంలో 41.5÷బిఅ, కొప్పెరపాడులో 41.4÷బిఅ, కడపలో 41.3÷బిఅ, తాడేపల్లిలో 41.2÷బిఅ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాలులు, పిడుగుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పశువులను చెట్ల కింద కట్టేయకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం సమయంలో చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. తగినంత నీరు తాగడం, ఎండలో ఎక్కువసేపు పనిచేయకుండా ఉండడం అవసరమని తెలిపారు.

## రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## బండి సంజయ్ కుమారుడి కేసు.. నీరుగారే ప్రయత్నం జరుగుతోందా?

మొదటి పేజీ తరువాయి

అంటే అవునని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.బండి భగీరథ్ కేసుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యానిస్తూ..'సిట్ అంటేనే కేసును నీరుగార్చడం' అని అన్నారు. బండి భగీరథ్ వ్యవహారంలో కేసు పెట్టి నాలుగు రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు 10 సిట్‌లు ఏర్పాటు చేశారని, కానీ ఏ సిట్ కూడా ఇప్పటివరకు నివేదిక ఇవ్వలేదని హరీష్ రావు ఆరోపించారు. సిట్ వేసి లీకులు ఇవ్వడం రేవంత్‌కు అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు.

## మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే పక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్ మరియు రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్ మరియు రిటైల్ లో ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర యూరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్ ను తీసుకువస్తుందని మంత్రి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్ ను అమలు చేయనున్నారని మంత్రి తెలిపారు. ÷ూష్ట్రంలో నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నానో యూరియా తయారీ సంస్థలు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. నానో యూరియా వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి 'రైతు నేస్తం' కార్యక్రమంలో ప్రసారం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని, సాధారణ యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు వివరించాలని ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని, ఆ ఫలితాల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగిస్తే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ / ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మి, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జకాత్ సెంటర్ ఇండియా ఆధ్వర్యంలో జకాత్ డిస్ట్రిబ్యూషన్ సెరిమనీ 2026' ఘనంగా నిర్వహణ

**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 11**
జకాత్ సెంటర్ ఇండియా వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో "జకాత్ డిస్ట్రిబ్యూషన్ సెరిమనీ--2026" కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు ఎల్‌బీ నగర్‌లోని ఐఎస్డీ ఏ--1 కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడిన 30 మంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సుమారు రూ.7,27,000 విలువైన సహాయాన్ని జకాత్ సెంటర్ ఇండియా వరంగల్ యూనిట్ తరఫున అందజేశారు. చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగేందుకు అవసరమైన సామగ్రి మరియు నగదు సహాయం పంపిణీ చేశారు. కార్యక్రమానికి జకాత్ సెంటర్ ఇండియా వరంగల్ యూనిట్ అధ్యక్షులు ఖాజా నజ్ముద్దీన్




అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా అబ్దుల్ జబ్బార్ సిద్ధిఖీ, మౌలానా హమీద్ మొహమ్మద్ ఖాన్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా మౌలానా జావీద్ ఉమ్రీ, మౌలానా ఫసీహుద్దీన్ ఖాస్మీ, మీర్ ఇద్రీస్ అలీ అజాజ్ బియాబానీ పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా షాహెద్ మసూద్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జకాత్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా కిరాణా షాపులు, టైలరింగ్, వెల్డింగ్ షాపులు, ఫ్రూట్స్ ఌ వెజిటబుల్స్ వ్యాపారం, జనరల్ స్టోర్లు, స్నాక్స్ కార్టు, ఎలక్ట్రీషియన్ షాపులు, కూల్ డ్రింక్స్ ఌ స్నాక్స్ వంటి చిన్న వ్యాపారాలకు సంబంధించిన సామగ్రిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. జకాత్ సహాయంతో పేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుని స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందగలుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో వారు ఇతరులకు సాయం చేసే స్థాయికి ఎదగాలని జకాత్ సెంటర్ ఇండియా లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఇంటర్ విద్యార్థుల (1995/1997) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**
హుజురాబాద్ స్థానిక విఎల్ఆర్ ఏసీ కన్వెన్షన్ హాల్లో అత్యంత ఘనంగా హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1995-97 ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు పుల్ల కరుణాకర్(ఇంటెలిజెన్స్ ఎస్పి), బోల్లం తిరుపతి(రియల్ ఎస్టేట్ వ్యాపారి), ఓరుగంటి తిరుపతి సీనియర్ విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతోపాటు భోదన చేసిన అధ్యాపకులు ఎస్ మనోహరా చారి, చంద్రమౌళి, శంకర్రావు, మహేందర్, నరసయ్య, తులసి దాస్, మొగులయ్య తో పాటు ప్రస్తుత కళాశాల అధ్యాపకుడు పూర్వ విద్యార్థుల పాల్గొన్నారు.

# జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలి : దాస్యం వినయ్ భాస్కర్

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**
హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్ర సమన్వయకర్త మంద శ్యామ్ నాయకత్వం లో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టర్లు, సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్లకు సముచిత ప్రాధాన్యం కల్పించారని అన్నారు. వేలాది మంది చిన్న కాంట్రాక్టర్లకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకే ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక వర్గాలకు చెందిన చిన్న కాంట్రాక్టర్లను



పక్కన పెడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చేసిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం వెనక్కి తగ్గిందని విమర్శించారు. జీవో నెం.17 కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్లకు అవకాశాలు తగ్గిపోతున్నాయని, దీంతో వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే జీవో నెం.17ను రద్దు చేసి చిన్న కాంట్రాక్టర్లకు



న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# యంగ్ అచీవర్స్ సన్మాన కార్యక్రమంలో విద్యార్థులకు ఘన గౌరవం

- ప్రపంచ రికార్డు సాధించిన చిన్నారి చెస్ ఛాంపియన్ శ్రీయాంశ్‌కు ప్రత్యేక సన్మానం



**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 11**
వరంగల్ జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "యంగ్ అచీవర్స్ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ 2025-26 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన టాపర్ విద్యార్థులతో పాటు ఎదుగుతున్న చెస్ ఛాంపియన్, రెండుసార్లు ప్రపంచ రికార్డు సాధించిన చిరంజీవి మాస్టర్ కొండ శ్రీయాంశ్ మురళీ కృష్ణ పటేల్ను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఈవో రంగయ్య నాయుడు, ఆర్డీఓ ఉమా తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది కార్యక్రమంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, మెమొంటోలు, శాలువాలు అందజేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అతిథులు ఆశీర్వదించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా "ఐరన్ జిమ్" ప్రారంభం

- హజరత్ మశూక్ ఏ రబ్బాని పీఠాధిపతి ఉబేద్ బాబా
- మహిళలు, పురుషులకు ప్రత్యేక సౌకర్యాలు యువతలో ఉత్సాహం





**కరపత్రం ప్రతినిధి వరంగల్ మే 11**
వరంగల్ నగరంలో ఆరోగ్య, ఫిట్‌నెస్ రంగానికి మరో ఆధునిక వేదిక చేరింది. నగరంలోని పోచమ్మ మైదాన్ సమీపంలోని రత్న హోటల్ పక్కన మ్యాక్స్ బిల్డింగ్ లో ఏర్పాటు చేసిన "ఐరన్ జిమ్"ను తెలంగాణ పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు సజ్జాదా దర్గా హజ్రత్ మషాఖ్ రహ్మతుల్లా అలైహ్ సజ్జద నషీన్ హజ్రత్ ఉబేద్ బాబా ఘనంగా ప్రారంభించారు. నిన్న రాత్రి 8 గంటలకు జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత, స్థానిక ప్రజలు హాజరై ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు నిర్వాహకుల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవీన్ రాజ్, ఎన్నారై ఇజాజ్ తదితరులు కూడా హాజరై నిర్వాహకులను అభినందించారు. విశిష్ట అతిథుల హాజరు, ఆశీస్సులు, ప్రజల ఆదరణ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని నిర్వాహకులు తెలిపారు. "ఐరన్ జిమ్" యజమాని, "మిస్టర్ తెలంగాణ" బిరుదు పొందిన వహీద్ ఖాన్ మాట్లాడుతూ, మహిళలు సురక్షితంగా వ్యాయామం చేయడానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరు సౌకర్యాలతో పాటు ఆధునిక ఫిట్‌నెస్ యంత్రాలు, అనుభవజ్ఞులైన శిక్షకులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ జిమ్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో హాజరైన అతిథులు, ప్రముఖులు, పౌరులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపిన డిసిసి ఉపాధ్యక్షులు అయ్యాల రాంరెడ్డి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**



హనుమకొండ డిసిసి ఉపాధ్యక్షులు అయ్యాల రాంరెడ్డి హనుమాన్ 'జయంతి" సందర్భంగా ఓరుగల్లు ప్రజలకు, ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజుకు, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు, 65వ డివిజన్ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ స్వామి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. హనుమంతుడు భక్తి, ధైర్యం, నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. యువత ఆంజనేయుని ఆదర్శాలను అనుసరించి దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ, ప్రజలందరికీ శుభం కలగాలని అయ్యాల రాంరెడ్డి మనసారా ఆకాంక్షించారు.

# అనిల్ కుమార్ కు ఉత్తమ జాతీయ జర్నలిస్ట్ అవార్డు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్, మే 10**
పత్రికారంగంలో విశిష్ట సేవలు అందించిన కరీంనగర్ తెలుగు వార్త బ్యూరో అనిల్ కుమార్‌కు "ఉత్తమ జాతీయ జర్నలిస్టు అవార్డు" లభించింది. దేశవ్యాప్తంగా సామాజిక సమస్యలు, ప్రజా అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన చేసిన విశ్లేషణాత్మక కథనాలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.
పలువురు ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు అనిల్ కుమార్‌ను అభినందించారు. నిజాయితీతో కూడిన వార్తా రచన, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ప్రజలకు నిష్పక్షపాత సమాచారాన్ని అందించడం జర్నలిస్టుల ప్రధాన ధ్యేయమని తెలిపారు. తనకు సహకరించిన సహచరులు, కుటుంబ సభ్యులు, పాఠకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**



తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హనుమాన్ 'జయంతి" సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, రైతు సోదరులకు, ఓరుగల్లు ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ స్వామి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. హనుమంతుడు భక్తి, ధైర్యం, నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. యువత ఆంజనేయుని ఆదర్శాలను అనుసరించి దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ, ప్రజలందరికీ శుభం కలగాలని చైర్మన్ మనసారా ఆకాంక్షించారు.

# హనుమాన్ 'జయంతి" శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి మే 11**



హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఓరుగల్లు ప్రజలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ లయన్ ముచ్చ రాజిరెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, బలం, ధైర్యం, సేవా తత్వానికి ప్రతీక అయిన శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రతి ఇంటిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ.. హనుమంతుడు కేవలం భక్తికి మాత్రమే కాదు, నిజాయితీకి, కర్తవ్య నిష్ఠకు, అంకిత భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. యువత హనుమంతుడి జీవితం నుండి స్ఫూర్తి పొందుతూ క్రమశిక్షణ, సేవా భావం, దేశభక్తిని అలవరచుకోవాలని సూచించారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, మానవత్వం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. హనుమాన్ జయంతి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ పవిత్ర సందర్భంగా ఆలయాల్లో నిర్వహించే ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని డాక్టర్ రాజిరెడ్డి పిలుపునిచ్చారు.

# కుమారస్వామికి తోట మైదానం వాకర్స్ ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి వరంగల్ మే 11**



వరంగల్ నగరంలోని గోపాల స్వామి గుడి తోట మైదానం వాకర్స్ ఆధ్వర్యంలో.. సోమవారం 22వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బసవరాజ్ కుమారస్వామికు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఖ్యలో పాల్గొని కార్పొరేటర్ సేవలను అభినందించారు. కార్యక్రమానికి వాకర్స్ ప్రెసిడెంట్ జి.సారయ్య, ఎం.వెంకటేశ్వర్లు, సెక్రటరీ అంజన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. "ప్రజలకు ఎప్పటికీ అందుబాటులో ఉంటాను. ఏ సేవ అవసరమైనా ముందుండి సహాయం చేస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిగురు మామిడి ప్రభాకర్, సుబ్బారావు, ఆర్.ప్రకాష్, సత్యం, పనికిరా సత్యం, కోటి, ఐలయ్య తదితర వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# కలలు నిజం కావాలంటే కష్టపడాలి





- మనపై మనకు నమ్మకం ఉంటేనే లక్ష్యాలు సాధ్యం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**కరపత్రం ప్రతినిధి మే 11**

విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో శ్రమిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. పదో తరగతిలో 550కు పైగా మార్కులు, ఇంటర్మీడియట్‌లో 980కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. చిన్న వయసులోనే చదరంగ పోటీల్లో రెండు ప్రపంచ రికార్డులు సాధించిన కొండా శ్రీయాంశ్ మురళీకృష్ణ పటేల్‌ను ప్రత్యేకంగా సన్మానించి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. విద్యార్థుల విజయాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, ఆ కలలు సాకారం కావాలంటే అహర్నిశలు కష్టపడాలని సూచించారు. “మనపై మనకు నమ్మకం ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతాం” అని పేర్కొన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని, పట్టుదలతో శ్రమిస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని తెలిపారు. ఉన్నత చదువుల దశలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. క్రమశిక్షణ విజయానికి మూలమని, చదువు వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ సేవకు దోహదపడాలని అన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన “సమాజానికి తిరిగి సేవ చేయాలి” అనే భావనను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను కోరారు.

చదరంగంలో ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీయాంశ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి బి. రంగయ్య నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబయ్య, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బాలగంగాధర్, రెవెన్యూ విభాగాధికారి సుమ, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియకు ప్రజలు సహకరించాలి ఎండీ అలీ

- ముఖ్య అతిథిగా ఖిలా వరంగల్ తాసిల్దార్ మొహమ్మద్ ఇక్బాల్





**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 11**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సీ రివిజన్) నమోదు ప్రక్రియలో భాగంగా.., నేడు(మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బక్షీ మొహల్లా,ఉరుసు కరీంబాద్ పరిధిలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు 41వ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఎండీ అలీ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఖిలా వరంగల్ ఎంఆర్వో మొహమ్మద్ ఇక్బాల్ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు.41వ డివిజన్ పరిధిలోని వద్ద ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఎస్ఐఆర్ నమోదు కోసం ప్రజలు తమ ఓటర్ ఐడీతో పాటు సంబంధిత ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.ముఖ్యంగా 2002 సంవత్సరం ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న పెద్దలు తమ ఓటర్ ఐడీ మరియు ఇతర అవసరమైన పత్రాలతో హాజరుకావాలని కోరారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన లేని వారికి సహాయ కేంద్రం ద్వారా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపారు.పెద్దల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అవసరమైన సహాయం అందిస్తామని,ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎండీ అలీ కోరారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి: బీఆర్ఎస్వీ

- బండి సంజయ్ కొడుకుకు ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా? అంటూ ఆగ్రహం

**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 11**

వరంగల్ కమిషనరేట్ కార్యాలయం ముందు బీఆర్ఎస్వీ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్లే కార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దాస్యం విజయ భాస్కర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేసును పక్కదారి



పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులను వేధించిన పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధిత బాలికకు న్యాయం చేయడంతో పాటు, ఆమె కుటుంబానికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, “బండి సంజయ్ కొడుకుకు ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా?” అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్, యూనివర్సిటీ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, రావుల కొలన నరేందర్, పబ్బోజు శ్రీకాంత్ చారి, సందీప్ యాదవ్, చిర్ర మహేష్ గౌడ్, చిర్ర ప్రకాష్ గౌడ్, స్నేహిత్, వినీల్ రావు, ఇస్మాయిల్, భార్గవ్, ఆదిత్య, అభినవ్, 47వ డివిజన్ అధ్యక్షుడు జగ్గు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ లో త్వరలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు

- ప్రణవ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- వైద్య రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి..



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**

హుజూరాబాద్ ప్రధాన ఆసుపత్రిలో త్వరలో ట్రామా కేర్ సెంటర్ ప్రత్యేక విభాగం ఏర్పడబోతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.ఈ మేరకు ఆయన కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ ట్రామా సెంటర్ రహదారి వెంబడి ప్రమాదాలు జరిగినప్పుడు త్వరితగతిన స్పందించి క్షతగాత్రులను తక్షణ చికిత్స అందించడానికి ఉపయోగపడుతుందని,వరంగల్,కరీంనగర్ ప్రధాన పట్టణాలకు మధ్యన హుజురాబాద్ ఉండడం వల్ల ఈ సెంటర్ రావడం చాలా ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహాతో ఇటీవల పలుమార్లు చర్చించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గంలో వైద్య రంగంలో అనేక నూతన మార్పులు తీసుకొచ్చి పేదలకు సరైన సమయంలో వైద్య సేవలు అందిస్తున్నామని ప్రణవ్ పేర్కొన్నారు.

# వడ్డెర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ గా గుంజ రేణుక నారాయణ నియామకంపై హర్షం

- అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మంజాల

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మే 10**

రాష్ట్రంలో అత్యంత బలహీనవర్గానికి చెందిన మహిళ గుంజ రేణుక నారాయణ ను వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మంజాల హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, బషీర్ నాగ్, దేశోద్ధారక భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు కుంచపు రామ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాపెన్ గిరిబాబు, ఉపాధ్యక్షులు ఏం. హనుమంతు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డి. కృష్ణ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఈ.




వెంకటేష్, ఎల్బీ నగర్ నియోజకవర్గం అధ్యక్షులు కె. బ్రహ్మయ్య తో కలసి రమేష్ మంజాల మాట్లాడుతూ.. గత ముఖ్యమంత్రి వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలో వడ్డెర కులస్థులు అత్యంత వెనుకబడి ఉన్నారని గుర్తించి, వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేసిన వడ్డెరుల సంక్షేమం కోసం రుణాలు మంజూరు చేయడం జరిగిందని, అనంతరం బి.ఆర్.ఎస్ పాలనలో వడ్డెర ఫెడరేషన్ కు నిధులు మంజూరు చేయకుండా మొండి చేయి చూపిందని గుర్తు చేసారు. సామజిక కార్యకర్తగా, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలుగా ప్రజలకు, పార్టీకు సేవలందించిన గుంజ రేణుక నారాయణ ను వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడాన్ని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన వడ్డెర కుల ద్రోహులు వ్యతరేకిస్తున్నారని, బి.ఆర్.ఎస్ హయాంలో వడ్డెర ఫెడరేషన్ కు ఎందుకు నిధులు కేటాయించలేదని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ ను ఎందుకు నియమించలేదని అయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అత్యంత వెనుకబడి ఉన్న వడ్డెర సామాజికవర్గాన్ని గుర్తించి వారి సాధికారతకు వడ్డెర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఒక మహిళను చైర్మన్ గా నియమించడం అభినందనీయం అని, అణుగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే కాంగ్రెస్ పార్టీ ని విమర్శిస్తే సహించేదిలేదని, తగిన బుద్ది చెపుతామని హెచ్చరించారు. వడ్డెరులు దశాబ్దాల నుండి కాంగ్రెస్ పార్టీ వెంటనే ఉన్నారని, ఇక ముందుకు కూడా కాంగ్రెస్ పార్టీ వెంటనే ఉంటామని రమేష్ మంజాల తెలిపారు.

# హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి జిల్లా నాయకులు రాంప్రసాద్

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**



బీజేపీ నాయకులు జాలిగాపు రాంప్రసాద్ హనుమాన్ జయంతి సందర్భంగా ఓరుగల్లు ప్రజలకు బీజేపీ జిల్లా నాయకులు జాలిగాపు రాంప్రసాద్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయ స్వామి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ.. హనుమంతుడు భక్తి, ధైర్యం, నిబద్ధతకు ప్రతీక అని అన్నారు. యువత ఆంజనేయుని ఆదర్శాలను అనుసరించి దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ, ప్రజలందరికీ శుభం కలగాలని జాలిగాపు రాంప్రసాద్ మనసారా ఆకాంక్షించారు.

# దేశాభివృద్ధిలో మహిళలకు 33% రిజర్వేషన్లు కీలకమైన మైలురాయి

- రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మే 10**

రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ సోమవారం హైదరాబాద్ , ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు.

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన చారిత్రాత్మక ‘నారీ శక్తి వందన్ అధినియం’ (మహిళా రిజర్వేషన్ బిల్లు) పట్ల మా ‘రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)’ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందని రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 33% వాటా కల్పించడం అనేది దేశాభివృద్ధిలో ఒక కీలక మైలురాయి అని అన్నారు. భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుకన్న మహిళా సాధికారతను నిజం చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చారిత్రాత్మకమైన ‘మహిళా రిజర్వేషన్ బిల్లు’ను తీసుకురావడం జరిగిందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు




కల్పిస్తూ మోడీ తీసుకున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ పరిణామం. ఇది మహిళా లోకానికి దక్కిన గొప్ప అదృష్టంగా మా పార్టీ భావిస్తోంది. అయితే, మహిళలకు ఇంతటి గొప్ప మేలు జరుగుతుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, వారి మిత్రపక్షాలు ఈ బిల్లు పట్ల వ్యవహరించిన తీరు, వారి వ్యతిరేక వైఖరి అత్యంత విచారకరమని అన్నారు. ఇది ఆ పార్టీకి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన మా ‘రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)’ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఈ బిల్లుకు అనుకూలంగా నిర్వహించిన ధర్నాలో శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, మహిళా బిల్లు పట్ల అవలంబించిన వ్యతిరేక విధానాలను అట్టడుగు వర్గాల ప్రజలకు, మహిళలకు తెలియజేయడమే లక్ష్యంగా, మా నాయకులు పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిరసన, మద్దతు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది. ఈ ధర్నా ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆవశ్యకతను, మోడీ కి మా పూర్తి మద్దతును బహిరంగంగా తెలియజేస్తున్నాము. ఈ ధర్నాకు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ నాయకులు డాక్టర్ సంఘం శ్రీధర్, రాష్ట్ర నాయకులు దాచారపు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డి రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్పీ నీల, పొలిటికల్ ఉమెన్స్ అధ్యక్షులు గంగాపురం పద్మ, జగన్నాథం రాజిరెడ్డి, అసెంట్ ఓనర్ సెక్రెటరీ ఎన్ ఆర్ సి రాజు, ఏఐఆర్ఆర్టీ సెక్రెటరీ నర్సింగ్ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాంబ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శ



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 11**

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకులను మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఎల్కతుర్తి మాజీ ఎంపీపీ తంగెడ శాలినీ భర్త, మాజీ మార్కెట్ డైరెక్టర్ తంగెడ మహేందర్, ఎల్కతుర్తి మాజీ సర్పంచ్ మాధవి భర్త గొల్లె మహేందర్ లు నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా కారు వేగంగా వచ్చి ఢీకొనగా తీవ్ర గాయాల పాలయ్యారు. దీంతో వారు హనుమకొండలోని రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. దీంతో సోమవారం హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఆస్పత్రికి వెళ్ళి వారిని పరామర్శించి, వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం. అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల ఆధ్యక్షులు పిట్టల మహేందర్, నాయకులు ఎల్తూరి స్వామి, సత్తూరి చంద్రమౌళి,జూపాక జడ్సన్, వేముల సమ్మయ్య భీమదేవరపల్లి మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు మండల సురేందర్, మాజీ ఎంపిటిసి వేముల శ్రీనివాస్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.